సాక్షి ఖమ్మం

మంగళవారం । 18 । మార్చి । 2025



సమస్యల పరిష్కారానికి కృషి

ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి పాటుపడతానని ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళవారం సా॥) 6.25

సహర్ (బుధవారం ఉ॥) 4.58

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం 39° / 22°

జిల్లాలో మంగళవారం ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలవుతుంది. మధ్యాహ్నానికి గరిష్ఠస్థాయికి చేరుతుంది.



తల్లి అండగా.. బిడ్డ చల్లగా

ఎండ తీవ్రత నానాటికీ పెరుగుతుండడంతో పెద్దల మాటేమో కానీ పిల్లలు తట్టుకోలేకపోతున్నారు. వివిధ పనులు, ఆస్పత్రులకు చిన్నపిల్లలతో ఖమ్మం వచ్చిన పలువురు వారిని ఎండ నుంచి రక్షించేందుకు ఇలా జాగ్రత్తలు తీసుకోవడం కనిపించింది. అయితే, ఎండ వేళ ఎవరూ బయటకు రావొద్దని, పిల్లలను తీసుకురాకపోవడమే మంచిదని వైద్యనిపుణులు సూచిస్తున్నందున మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

న్యూస్‌రీల్

ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పొడిగింపు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం టేకులపల్లిలోని జిల్లా మహిళా ప్రాంగణంలో నిరుపేద యువతులు, మహిళలకు ఉపాధి రంగాల్లో శిక్షణ ఇవ్వనుండగా, దరఖాస్తు గడువు ఈనెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రాంగణం అధికారి వేల్పుల విజేత తెలిపారు. 18 – 45 ఏళ్ల వయస్సు కలిగిన మహిళలకు ఉచిత భోజన, వసతితో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. టైలరింగ్, కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్, కారు, ఆటో డ్రైవింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్‌లో రెండు నెలల నిడివితో శిక్షణ కొనసాగుతుందని తెలిపారు. కోర్సుల వారీగా ఎనిమిదో తరగతి మొదలు ఎస్సెస్సీ, డిగ్రీ పూర్తిచేసిన వారు అర్హులని, డ్వాక్రా గ్రూప్‌ల సభ్యులకు ప్రాధాన్యత ఉంటుందని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, విద్యార్హత సర్టిఫికెట్ కాపీలు జతపరిచిన దరఖాస్తులను ఈనెల 31లోగా మహిళా ప్రాంగణంలో అందజేయాలని, శిక్షణ పూర్తయ్యాక రాయితీతో కూడిన రుణాలు ఇప్పిస్తామని విజేత తెలిపారు.

ఏదులాపురం కమిషనర్‌గా శ్రీనివాసరెడ్డి



అదనపు కలెక్టర్ శ్రీజకు పుష్పగుచ్ఛం ఇస్తున్న శ్రీనివాసరెడ్డి

ఖమ్మం రూరల్: ఇటీవల ఏర్పడిన ఏదులాపురం మున్సిపాలిటీ కమిషనర్‌గా ఆళ్ల శ్రీనివాసరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జ్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా నుంచి బాధ్యతలు స్వీకరించిన ఆయన ఆతర్వాత కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజను మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా, శ్రీనివాసరెడ్డి గతంలో జిల్లాలోని వివిధ మండలాల ఎంపీడీఓగా, ఇల్లెందు మున్సిపల్ కమిషనర్‌గా, పెద్దతండా పంచాయతీ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం డీఆర్‌డీఏ డీపీఎం(ఫైనాన్స్)గా పనిచేస్తున్న ఆయనను ఏదులాపురం మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు.

రాజీవ్ యువవికాసం పథకానికి దరఖాస్తులు

ఖమ్మంమయూరిసెంటర్: రాజీవ్ యువ వికాసం పథకానికి గిరిజన నిరుద్యోగ యువత ఏప్రిల్ 5వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ డీడీ ఎన్.విజయలక్ష్మి తెలిపారు. షెడ్యూల్ తెగల నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రకటించిందని వెల్లడించారు. ఆసక్తి, అర్హత ఉన్న వారు https://tgobmmsnew.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

బీసీ గురుకులాల్లో ప్రవేశానికి ఏప్రిల్ 20న పరీక్ష

ఖమ్మంమయూరిసెంటర్: మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల గురుకుల విద్యాలయాల్లో వచ్చే విద్యాసంవత్సరానికి 6, 7, 8, 9వ తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఏప్రిల్ 4న పరీక్ష నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని బీసీ గురుకుల విద్యాసంస్థల ఉమ్మడి జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి సీహెచ్.రాంబాబు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 24 బీసీ గురుకుల పాఠశాలలు ఉండగా, 6వ తరగతిలో బాలికలకు 249, బాలురకు 294, 7వ తరగతిలో బాలికలకు 170, బాలురకు 177, 8వ తరగతిలో బాలికలకు 97, బాలురకు 124, 9వ తరగతిలో బాలికలకు 139, బాలురకు 184 బ్యాక్‌లాగ్ సీట్లు ఉన్నాయని వెల్లడించారు. ప్రవేశాలకు రూ.150 చెల్లించి ఈనెల 31లోగా https://mjptbcadmissions.org/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 20న ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు.

మత్స్యకారులకు శిక్షణ ప్రారంభం

కూసుమంచి: కూసుమంచి మండలంలోని పాలేరు పీ.వీ.నర్సింహారావు మత్స్య పరిశోధనా కేంద్రంలో ములుగు జిల్లాకు చెందిన ఎస్టీ మత్స్యకారులకు మూడు రోజుల పాటు ఇవ్వనున్న శిక్షణ సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్ చేపల పెంపకంలో పద్ధతులు, చేపల సంరక్షణ, దాణా తయారీపై అవగాహన కల్పించారు. అనంతరం జుజుల్‌రావుపేట, నాచేపల్లిలోని ఫిషరీస్ కేంద్రాలను తీసుకెళ్లి వివిధ రకాల చేపలు, రొయ్యల పెంపకం తీరును వివరించారు.

తస్మాత్ జాగ్రత్త



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి.కళావతిబాయి


ఖమ్మంవైద్యవిభాగం: రోజురోజుకూ ఎండలు పెరుగుతున్న నేపథ్యాన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి బి.కళావతిబాయి సూచించారు. జిల్లాలో పగటిపూట ఉష్ణోగ్రత 40 డిగ్రీలు దాటుతున్న నేపథ్యాన ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉందని తెలిపారు. ఈమేరకు ఎండ నుండి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వడదెబ్బ బారిన పడిన వారికి చికిత్స కోసం వైద్య, ఆరోగ్య శాఖ చేపడుతున్న చర్యలను ఆమె 'సాక్షి' ఇంటర్వ్యూలో వివరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ వెల్లడించిన అంశాలు ఆమె మాటల్లోనే...

ఎండల వేళ అప్రమత్తంగా లేకపోతే ఇబ్బందే

- వడదెబ్బ బాధితుల చికిత్సకు ఆస్పత్రుల్లో ఏర్పాట్లు
- అత్యవసర సమాచారానికి కంట్రోల్ రూం కూడా..
- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి కళావతిబాయి

పగలు ఎండ.. రాత్రి చలి

ఇటీవల వాతావరణంలో మార్పులు కనిపిస్తున్నాయి. పగటిపూట ఎండ, అర్ధరాత్రి నుండి ఉదయం వరకు చలితీవ్రత ఉంటోంది. ఇలాంటి పరిస్థితితో వివిధ రకాల వ్యాధులు ప్రబలే ప్రమాదముంది. జ్వరం, జలుబు, దగ్గు, అస్తమా వంటి వ్యాధులతో పాటు ఎండతీవ్రత కారణంగా వడదెబ్బకు గురయ్యే అవకాశముంది. ప్రధానంగా వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, వివిధ రకాల వ్యాధులతో బాధపడేవారు మరింత జాగ్రత్తగా ఉండాలి. ఎండ తీవ్రత నేపథ్యాన ఉదయం 11నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇళ్ల నుండి బయటకు రాకపోవడమే మంచిది. తప్పనిసరై వస్తే తలకు టోపీ, ఖద్దర్ వస్త్రాలు, గొడుగు, చలువ కళ్లద్దాలు ధరించాలి.



మా తరఫున సిద్ధం

వేసవి దృష్ట్యా గత నెలలోనే టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించాం. జిల్లాలోని అన్ని మండలాల్లో ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలను సిద్ధం చేశాం. 24 పీహెచ్‌సీలు, నాలుగు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లకు లక్ష ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు చేరవేశాం. అవసరమైతే మరిన్ని ప్యాకెట్లు పంపిస్తాం. జిల్లా కేంద్రంలో 97041 50025 టోల్‌ఫ్రీ నంబర్‌తో కంట్రోల్ రూం ఏర్పాటు చేశాం. ఎండ వేడితో ఎవరైనా అనారోగ్యానికి గురైతే ఈ టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయొచ్చు.

ఆహారమూ ముఖ్యమే..

ఈ వేసవిలో ఎప్పటికప్పుడు వండిన ఆహారాన్నే తీసుకోవాలి. నిమ్మరసం, ఓఆర్‌ఎస్, వివిధ రకాల పండ్ల రసాలు, కొబ్బరి నీరు ఎక్కువగా తీసుకోవడం మంచిది. అలాగే, మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండాలి. జంక్‌ఫుడ్స్ సైతం తీసుకోవద్దు. ఎండవేడితో శరీరం డీహైడ్రేషన్ కాకుండా ప్రతీ గంటకు ఒక గ్లాస్ నీరు తీసుకోవాలి.

అలాగే ఎవరికైనా కళ్లు తిరగటం, వాంతి వచ్చినట్లు అనిపించటం, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురైతే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సంప్రదించాలి. ఇప్పటికే వైద్య ఆరోగ్య శాఖ అధికారులను అప్రమత్తం చేయగా.. వివిధ శాఖల సమన్వయంతో అన్ని జాగ్రత్త చర్యలు చేపడుతున్నాం. ప్రజలు ఆందోళన చెందాల్సిన పని లేకున్నా... ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం మరవొద్దు.

ఎప్పటికప్పుడు పరిష్కరించండి

- గ్రీవెన్స్ ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండొద్దు
- అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి

ఖమ్మం సహకారనగర్: ప్రజలు ఇచ్చే ప్రతీ ఫిర్యాదును పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా వారు ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో పెండింగ్ దరఖాస్తులపై సమీక్షించిన అదనపు కలెక్టర్లు పలు సూచనలు చేశారు. డీఆర్వో పద్మశ్రీ, డీఆర్‌డీఓ సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- ఖమ్మం పాత బస్టాండ్ వద్ద ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సమీపాన వ్యాపారాలు చేసుకుంటున్న తమకు అక్కడ కనీస వసతులు కల్పించాలని చిరువ్యాపారులు విన్నవించారు.
- కూసుమంచి మండలం పెరిక సింగారంలోని సర్వే నంబర్ 231లో 1.03గుంటల భూమి తన భర్త పేరిట ఉండగా, ఆడపడుచు నకిలీ పత్రాలతో పాసుబుక్ తీసుకుందని బి.ఆదెమ్మ ఫిర్యాదు చేసింది.
- ఖమ్మం దొరన్ననగర్‌కు చెందిన జి.నరేష్‌కు ఆయన భార్యతో గొడవలు జరుగుతుండగా, ఆమెకు వారి కుటుంబీకులు తన అనుమతి లేకుండా అబార్షన్ చేయించారని ఫిర్యాదు చేశాడు.
- ఖమ్మం టేకులపల్లిలో కేసీఆర్ టవర్స్‌లో నివాసముండే ఎస్.కే.హసీనా షార్ట్ సర్క్యూట్ కారణంగా సామగ్రి కాలిపోయినందున పరిహారం ఇప్పించాలని వినతిపత్రం అందజేసింది.

బ్యాటరీ బండి ఇప్పించండి..



పూర్తిగా దివ్యాంగురాలినైన నేను ఎటైనా వెళ్లాల్సి వస్తే ఇబ్బంది ఎదురవుతోంది. దీన్ని పరిగణనలోకి తీసుకుని నాకు వాహనం ఇప్పించాలి. గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. ఇకనైనా బ్యాటరీ వాహనం ఇప్పించాలని కోరేందుకు వచ్చా.

– కె.వెంకమ్మ, పండితాపురం, కామేపల్లి మండలం

సదరం సర్టిఫికెట్ కోసం వచ్చా...



సదరం సర్టిఫికెట్ రెన్యువల్ కోసం అధికారుల చుట్టు పలుమార్లు తిరిగాను. అయినా ఇప్పటి వరకు స్పందించడం లేదు. ఒకరి వద్దకు వెళ్తే ఇంకొకరికి కలవాలని అటూఇటు తిప్పిస్తున్నారు. అందుకే కలెక్టర్ సార్‌ను కలవాలని నేరుగా ఇక్కడికే వచ్చాను.

– గుడిగ వెంకన్న, నారపునేనిపల్లి, వైరా

పండితాపురం సంత @ రూ.2,42,30,000

- పోటాపోటీగా వేలం పాడడంతో పెరిగిన ధర
- గత ఏడాదితో పోలిస్తే రూ.36.20లక్షలు అధికం



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

ఆర్థిక సంవత్సరం	ఆదాయం
2019-20	రూ.2,05,30,000
2020-21	రూ.91,70,000 (కరోనా)
2021-22	రూ.1,99,30,000
2023-24	రూ.2,39,50,000
2024-25	రూ.2,06,10,000
2025-26	రూ.2,42,30,000

కామేపల్లి: కామేపల్లి మండలం కొమ్మినేపల్లి(పండితాపురం) గ్రామపంచాయతీ పరిధి శ్రీ కృష్ణప్రసాద్ సంతకు వివిధ ప్రాంతాల నుంచి క్రయవిక్రయదారులు వస్తుండడంతో రాష్ట్రంలోనే పేరుంది. ప్రతీ బుధవారం జరిగే ఈ సంతలో ప్రధానంగా పశువులు, మేకలు, గొర్రెల అమ్మకం ఎక్కువగా జరుగుతుంది. దీంతో సంత నిర్వహణను దక్కించుకునేందుకు పలువురు పోటీ పడుతుండగా వేలంలో రికార్డు స్థాయి ధర నమోదవుతోంది. ఇందులో భాగంగా ఈసారి రూ.2,42,30,000 పలకగా కొత్త రికార్డు నెలకొంది.

గత నెల 13న నిర్వహించినా...



భూక్యా వీరన్న

2025–26 ఆర్థిక సంవత్సరానికి బాధ్యతలు అప్పగించేందుకు ఈనెల 13న గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి రవీందర్ అధ్యక్షతన బహిరంగ వేలం నిర్వహించారు. అయితే, నలుగురు పాల్గొనగా బోడా శ్రీను రూ.2,35,70,000 అత్యధికంగా పాడినా ప్రభుత్వ మద్దతు ధర రాలేదని అధికారులు రద్దు చేశారు. తిరిగి సోమవారం డీఎల్‌పీఓ రాంబాబు సమక్షంలో జీపీ ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ రవీందర్ అధ్యక్షతన వేలం నిర్వహించగా గ్రామానికి చెందిన భూక్యా వీరన్న, బానోత్ లక్ష్మణ్, బోడా శ్రీను పాల్గొన్నారు. గత వేలం పాటలో హెచ్చుగా నమోదైన రూ.2,35,70,000 నుంచి ప్రారంభించగా భూక్యా వీరన్న, బానోతు లక్ష్మణ్ మధ్య హోరాహోరీగా వేలం సాగింది. చివరకు భూక్యా వీరన్న రూ.2,42,30,000కు హెచ్చు పాటదారుడిగా నిలిచాడు. ప్రభుత్వ మద్దతు ధర రూ.2,42,01,540 కంటే ఎక్కువకు పాడడంతో వీరన్ననే ఖరారు చేశారు. ఈమేరకు ఆయన సాల్వేన్సీ రూ.5లక్షలతో పాటు పాట మొత్తంలో మూడో వంతైన రూ.80.77లక్షలు అక్కడికక్కడే చెల్లించాడు.

కాగా, గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ.36.20లక్షలు అధికంగా జీపీకి ఆదాయం లభించింది. వేలం దృష్ట్యా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై సాయికుమార్ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ప్రభాకర్‌రెడ్డి, జీ.వీ.సత్యనారాయణ, కార్యదర్శి శంకర్, నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ..

పండితాపురం సంత ఏర్పడి సుమారు 30 ఏళ్లవుతోంది. తొలినాళ్లలో రూ.వందల్లోనే పలికే పాట ఇప్పుడు రూ.కోట్లకు చేరింది. గ్రామంలో వర్గపోరు కారణంగా ఆధిపత్యం సాధించాలంటే సంత తమ ఆధీనంలో ఉండాలని పోటీ పడుతుండడం ఆనవాయితీగా మారింది. గిరిజనులు మాత్రమే వేలంలో పాల్గొనే అవకాశమున్న ఈ సంతకు గ్రామస్థాయిలోనే కాదు రాష్ట్ర స్థాయిలోనూ మంచి గుర్తింపు ఉన్న కారణంగా వేలంలో రికార్డు ధర నమోదవుతుండగా, అదేస్థాయిలో గ్రామపంచాయతీకి నిధులు జమ అవుతున్నాయి. ఈ నిధులతో గ్రామంలో అనేక అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నారు. కాగా, కరోనా వ్యాప్తి సమయాన కొద్దివారాలు మాత్రమే సంత నిలిచిపోయింది.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా 'నెల్లూరి'



కోటేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నెల్లూరి కోటేశ్వరరావు నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ రాష్ట్ర ఎన్నికల కో రిటర్నింగ్ ఆఫీసర్ గీతామూర్తి పేరిట ప్రకటన వెలువడింది. అలాగే, ఐదు నియోజకవర్గాల నుంచి రాష్ట్ర కౌన్సిల్‌కు ఐదుగురిని ఎంపిక చేశారు. ఇందులో డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు(ఖమ్మం), గడ్డం వెంకటేశ్వర్లు(పాలేరు), గుగులోత్ నాగేశ్వరరావు(మధిర), బి.సుజాత(వైరా), జె.నరేష్(సత్తుపల్లి) ఉన్నారు. ప్రస్తుతం జిల్లా అధ్యక్షుడిగా గల్లా సత్యనారాయణ ఉండగా ఆయన స్థానంలో ఎంపికైన కోటేశ్వరరావు స్వస్థలం కొణిజర్ల మండలం అమ్మపాలెం. 2012లో ఆర్‌ఎస్‌ఎస్ ద్వారా తన ప్రస్థానం ప్రారంభించిన ఆయన పార్టీలో వివిధ బాధ్యతలు నిర్వర్తించారు.

ఇంటి వద్దకే రాములోరి తలంబ్రాలు

- ఆర్టీసీ కార్గో ద్వారా చేరవేసేలా ఏర్పాట్లు
- ఆన్‌లైన్ లేదా కార్గో పాయింట్లలో బుకింగ్‌కు అవకాశం



తలంబ్రాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సత్తుపల్లి డీఎం రాజ్యలక్ష్మి, ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: భద్రాచలంలో వచ్చేనెల 6న జరగనున్న శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణానికి హాజరుకాలేని భక్తులకు తలంబ్రాలు ఇంటి వద్దే అందించనున్నట్లు ఆర్టీసీ ఖమ్మం రీజినల్ మేనేజర్ ఏ.సరిరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా ఈ సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం భక్తులు రూ.151 చెల్లించి ఆర్టీసీ కార్గో ద్వారా బుక్ చేసుకుంటే ముత్యంతో కూడిన తలంబ్రాల ప్యాకెట్‌ను ఇంటి వద్దే అందిస్తామని తెలిపారు. ఆర్టీసీ వెబ్‌సైట్ ద్వారా లేదా బస్టాండ్లలోని కార్గో పాయింట్లు, ఏజెంట్ల వద్ద బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

- సత్తుపల్లిటౌన్: భద్రాచలం శ్రీసీతారాముల కల్యాణ ముత్యాల తలంబ్రాల బుకింగ్ వివరాలతో రూపొందించిన కరపత్రాలను సత్తుపల్లిలో ఆర్టీసీ డీఎం యు.రాజ్యలక్ష్మి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ, ఎంఎఫ్ ఎస్.సాహితీ, మునీర్‌పాషా, బాబురావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డిపోల వారీగా సంప్రదించాల్సిన నంబర్లు

ఖమ్మం	91542 98583
మధిర	91542 98584
సత్తుపల్లి	91542 98585
భద్రాచలం	91542 98586
కొత్తగూడెం	91542 98587
మణుగూరు	91542 98588
ఇల్లెందు	91542 98587

మళ్లీ తెరపైకి గొర్రెల పథకం అక్రమాలు

- ఇటీవల రికార్డులతో పాటు క్షేత్రస్థాయిలో విజిలెన్స్ తనిఖీలు
- తాజాగా వరంగల్‌లో పశువైద్యాధికారుల విచారణ



ఖమ్మంవ్యవసాయం: గొర్రెల పంపిణీ పథకంలో జరిగిన అక్రమాల వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. జిల్లాలో జరిగిన అక్రమాల నిగ్గు తేల్చేందుకు వరంగల్ నుంచి వచ్చిన విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ విభాగానికి చెందిన ముగ్గురు అధికారుల బృందం రెండు రోజుల పాటు తనిఖీలు, క్షేత్రస్థాయి విచారణ చేపట్టింది. ఈసందర్భంగా ఖమ్మంలోని జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో 2017–18 నాటి గొర్రెల పథకం తాలుకా రికార్డులు, బిల్లులు, బీమా వివరాలను పరిశీలించడమే కాక మధిర, ఎర్రుపాలెం మండలాల్లో పర్యటించింది. తాజాగా సోమవారం జిల్లాలోని ఐదుగురు పశువైద్యాధికారులను విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు సోమవారం వరంగల్‌కు పిలిపించి విచారణ నిర్వహించారు.

ఏమిటీ పథకం?

గత ప్రభుత్వ హయాంలో గొర్రెల పెంపకందారుల ఆర్థిక పరిపుష్టి కోసం 2017లో గొర్రెల పంపిణీ పథకాన్ని రెండు విడతలుగా అమలు చేసింది. అయితే, రాష్ట్ర వ్యాప్తంగా రూ.కోట్లలో అక్రమాలు జరిగాయని 'కాగ్' గుర్తించగా, నివేదిక ఆధారంగా అప్పట్లోనే పలు జిల్లాల్లో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్, ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. ఈ వ్యవహారంలో ఓ ఉన్నత స్థాయి అధికారిని అరెస్ట్ చేయగా, ఇంకొందరిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈనేపథ్యాన ఖమ్మం జిల్లాలోనూ అక్రమాలు జరిగాయంటూ బాధ్యులుగా పలువురికి నోటీసులు ఇచ్చారు.

అక్రమాలు ఇలా..

గొర్రెల పంపిణీ పథకంలో ఒక్కో లబ్ధిదారుడికి రూ.1.25 లక్షల విలువైన యూనిట్(21గొర్రెలు) ఇవ్వాలని నిర్ణయించారు. జిల్లాలో 32,513 మందిని అర్హులుగా గుర్తించి 2017–18లో 10,538 మందికి గొర్రెలు అందించారు. ఈ మొత్తంలో 970 యూనిట్లకు సంబంధించి అక్రమాలు జరిగాయని కాగ్ నివేదికలో పేర్కొంది. ఒక్కో యూనిట్ రవాణాకు రూ.6వేలు చెల్లించాలని నిర్ణయించడంతో జిల్లా లబ్ధిదారులకు ప్రకాశం, చిత్తూరు, కడప జిల్లాల నుంచి గొర్రెలను తెప్పించారు. అయితే, రవాణా కాంట్రాక్టర్లు ఇచ్చిన బిల్లుల ఆధారంగా పశుసంవర్ధ శాఖ నగదు చెల్లించింది. కానీ కాంట్రాక్టర్లు సమర్పించిన వాహనాల నంబర్లను పరిశీలించగా అంబులెన్స్‌లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఉండడం, 106 చోట్ల అంకెల మార్పిడి జరగడంతో రూ.17కోట్లు దుర్వినియోగం జరిగినట్లు తేల్చారు. ఇందులో కాంట్రాక్టర్లతో పాటు 27 మంది పశువైద్య అధికారుల బాధ్యత ఉందని చెబుతూ వివరణ తీసుకున్నారు. అయితే, ఈ కేసు ఇన్నాళ్లు మూలనపడగా మరోసారి విచారణ జరిపి సమగ్ర నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ విభాగాన్ని ఆదేశించింది. దీంతో అక్రమాల వ్యవహారం తెరపైకి రావడం, ముమ్మరంగా విచారణ జరుగుతుండగా.. విజిలెన్స్ విభాగం అధికారులు త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా ఎవరిపై వేటు పడుతుందోనని పశు సంవర్ధక శాఖ ఉద్యోగుల్లో చర్చ జరుగుతోంది.

క్లుప్తంగా

ఖేలో ఇండియా పోటీలకు ఎంపిక


పవిత్రాచారి

ఖమ్మం స్పోర్ట్స్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిలాస్‌పూర్‌లో జరగనున్న ఖేలో ఇండియా ఉషూ టోర్నీకి తెలంగాణ నుంచి ఖమ్మంకు చెందిన పి.పవిత్రాచారి ఎంపికైంది. ఇటీవల కర్ణాటక రాష్ట్రం భాగల్‌పూర్‌లో జరిగిన సౌత్ జోన్ పోటీల్లో ప్రతిభ చాటిన ఆమె జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈసందర్భంగా ఆమెను డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, కోచ్ పి.పరిపూర్ణచారి అభినందించారు.

న్యాయవ్యవస్థపై అవగాహన అవసరం


సదస్సును ప్రారంభిస్తున్న జడ్జి చంద్రశేఖరరావు

కొణిజర్ల: బాలికలు న్యాయ వ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలని, తద్వారా హక్కుల పరిరక్షణ సాధ్యమవుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే.వీ.చంద్రశేఖరరావు తెలిపారు. తనికెళ్లలోని తెలంగాణ గురుకుల సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ఆకాంక్ష ట్రస్టు ఆధ్వర్యాన సోమవారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన బాలికల సంరక్షణకు ఉన్న చట్టాలు, సెక్షన్లను వివరించారు. ఆయా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, తద్వారా అవసరమైన సమయంలో మేలు జరుగుతుందని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.రజిత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్, డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.నవ్య, అధ్యాపకులు కే.పీ.ఐశ్వర్య, కె.రజిని, కె.రజితతో పాటు ఎస్.శ్రీనివాసశర్మ, సీహెచ్.హైమావతి, ప్రతిభారెడ్డి, నాగమణి, లలిత, వంగూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి లోను కావొద్దు


మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖరశర్మ

పెనుబల్లి: పదో తరగతి విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా సిద్ధమై వార్షిక పరీక్షలు రాయాలని డీఈఓ సోమశేఖరశర్మ సూచించారు. మండలంలోని వీఎం బంజర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం సోమవారం నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించడమే కాక భవిష్యత్ లక్ష్యాలపై దృష్టి సారించాలన్నారు. డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ప్రశ్నాపత్రాన్ని క్షుణ్ణంగా చదివాక జవాబులు సూటిగా సకాలంలో రాయాలని సూచించారు. వీఎం బంజర్ ఎస్సై కె.వెంకటేష్, పాఠశాల హెచ్‌ఎం ఎస్.సత్యనారాయణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.45.16 లక్షలకు పాలేరు సంత ఖరారు


ఉపేందర్‌రెడ్డి

కూసుమంచి: మండలంలోని పాలేరులో ప్రతీ శుక్రవారం జరిగే సంత ఏడాది కాలం నిర్వహణ అప్పగించేందుకు సోమవారం వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని కొత్తూరుకు చెందిన బజ్జూరు ఉపేందర్‌రెడ్డి రూ.45.16లక్షలకు దక్కించుకున్నారు. గత ఏడాది రూ.37.60లక్షలు పలకగా, ఈసారి రూ.7.56 లక్షలు అదనంగా ఆదాయం సమకూరింది. వేలంలో మొత్తం 19మంది పాల్గొనగా ప్రభుత్వ మద్దతు ధర రూ.51,29,700గా నిర్ణయించి పాట మొదలుపెట్టడంతో ఉపేందర్‌రెడ్డి అత్యధికంగా పాడారు. ఎంపీఓ రాంచందర్‌రావు, గ్రామ కార్యదర్శి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు లాక్కెళ్లిన దుండగులు

కల్లూరు/కల్లూరు రూరల్: మండలంలోని కొర్లగూడెంకు చెందిన మహిళ బైరెడ్డి పద్మావతి సోమవారం తన ఇంటి ముందు పని చేసుకుంటుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలో నుంచి 25 గ్రాముల బంగారం గొలుసు లాక్కుని పారిపోయారు. కన్నుమూసి తెరిచేలోగా నిందితులు పారిపోయారని బాధితురాలు వాపోయింది. రూ.లక్షకు పైగా విలువైన గొలుసు చోరీపై ఆమె ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,400	5,300
కందులు	6,850	5,500
మిర్చి	13,700	5,900
మిర్చి తాలు	6,100	5,000
పత్తి	7,000	6,100

– ఖమ్మం వ్యవసాయం

అన్ని రైళ్లూ ఆలస్యమే !

- గంటల తరబడి ప్రయాణికులు పడిగాపులు
- మూడో లైన్ పనులే కారణమంటున్న అధికారులు
- పనులు నత్తనడకన సాగుతుండడంతో ఇక్కట్లు


14వ తేదీ రాత్రికి బదులు 15న తెల్లవారుజామున ఒంటి గంటకు తిరుపతికి చేరిన కృష్ణా ఎక్స్‌ప్రెస్ (రన్నింగ్ స్టేటస్)

ఖమ్మం రాపర్తినగర్: దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఏడాది కాలంగా కొనసాగుతున్న మూడో లైన్ నిర్మాణ పనులు ప్రయాణికులకు తిప్పలు తెచ్చిపెడుతున్నాయి. రోజుల తరబడి రైళ్ల రద్దు చేయడం.. మిగతా రోజుల్లో గంటల కొద్ది ఆలస్యంగా నడుస్తుండడంతో ప్రయాణికులు గంటల తరబడి స్టేషన్లలో పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదంతా ప్రహసనంగా భావిస్తున్న పలువురు రైలు ప్రయాణానికి దూరంగా ఉంటున్నారు. తప్పని పరిస్థితుల్లో ప్రయాణాన్ని ఎంచుకున్నా సమయానికి గమ్యస్థానాలకు చేరలేక... ఆలస్యం కారణంగా సమయం కోల్పోతున్నారు.

ఖమ్మం మీదుగా 107 రైళ్లు

ఖమ్మం రైల్వేస్టేషన్ మీదుగా 107 రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. ఇందులో 83 రైళ్లకే ఇక్కడ హాల్టింగ్ ఉంది. ఇక్కడి నుంచి తిరుపతి వెళ్లే ప్రయాణికులు కృష్ణా, పద్మావతి తదితర రైళ్లను ఎంచుకుంటుండగా గోల్కొండ, శాతవాహన, ఇంటర్‌సిటీ, కోణార్క్, హౌరా, గౌతమి, పద్మావతి, చార్మినార్, జీ.టీ., వందేభారత్, మచిలీపట్నం తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లలో రోజుకు 13వేల మంది తమ ప్రయాణాలు సాగిస్తుంటారు. అయితే రద్దయినప్పుడు కాకుండా మిగతా రోజుల్లో దాదాపు అన్ని రైళ్లు నిర్ణీత సమయానికి మించి గంట, రెండు గంటలు ఒక్కోసారి అంతకు మించి ఆలస్యంగా నడుస్తుండడంతో ప్రయాణికులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా ఎక్కువమంది రాకపోకలు సాగించే కృష్ణా, గోల్కొండ, శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆలస్యంగా నడుస్తుండడంతో పిల్లాపాపలతో ముందుగానే స్టేషన్లకు చేరుకుంటున్న వారి బాధలు వర్ణనాతీతంగా మారుతున్నాయి. మూడో రైల్వేలైన్ నిర్మాణానికి తోడు స్టేషన్లలోనూ అభివృద్ధి పనులు కొనసాగుతుండడంతో కూర్చునేందుకు సరిపడ బల్లలు లేక వారి వస్థలు మరింత పెరుగుతున్నాయి.

ఎప్పుడు వెళ్తామో.. ఏమో

ఏడాదికాలంగా ఖమ్మం మీదుగా వెళ్లే రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా నడవాడాకి మూడే లైన్ నిర్మాణ పనులే కారణమని రైల్వే శాఖ అధికారులు చెబుతున్నారు. కాగా, చాలా మంది తిరుపతి వెళ్లేందుకు కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ను ఎంచుకుంటారు. నిర్ణీత సమయానికి ఈ రైలు నడిస్తే ఉదయం ఖమ్మంకు 10గంటలకు వచ్చి తిరుపతికి రాత్రి 9-40గంటలకు చేరాలి. కానీ గంటల తరబడి ఆలస్యంతో తిరుపతి వెళ్లేసరికి ఒక్కోరోజు అర్ధరాత్రి 12, ఒంటి గంట దాటుతోంది. దీంతో ఆ సమయాన తిరుమల వెళ్లడానికి బస్సులు లేక స్టేషన్, ఆరుబయట వేచి ఉండాల్సి వస్తోంది. ఇక దర్శనం అనంతరం తిరుగు ప్రయాణానికి సైతం ముందుగానే టికెట్లు బుక్ చేసుకుంటున్న కొందరికి దర్శనం ఆలస్యమై వారు బయలుదేరాల్సిన రైలు అందుకోలేకపోతున్నారు.

- ప్రతిరోజు ఆదిలాబాద్ నుంచి తిరుపతి వెళ్లే కృష్ణా ఎక్స్‌ప్రెస్ సాఫీగా నడిస్తే ఖమ్మం స్టేషన్‌కు ఉదయం 10గంటలకు చేరాలి. అయితే, గత శుక్రవారం నాలుగున్నర గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 2-30గంటలకు చేరింది. ఇదే రైలు రాత్రి 9-40గంటలకు తిరుపతి చేరుకోవాల్సి ఉన్నా ఆలస్యం కారణంగా అర్ధరాత్రి 12-50 అయింది. దీంతో తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లిన భక్తులు స్టేషన్‌లోనే పడిగాపులు కాసి శనివారం ఉదయం కొండపైకి వెళ్లాల్సి వచ్చింది. ఇక ఇదే రైలు ఆదివారం 2-20గంటల ఆలస్యంగా మధ్యాహ్నం 12-20కి, సోమవారం 1-10గంటల ఆలస్యంగా 11-10గంటలకు ఖమ్మం చేరుకుంది.
- ప్రతిరోజు తిరుపతి – ఆదిలాబాద్ మార్గంలో నడిచే కృష్ణా ఎక్స్‌ప్రెస్ ఖమ్మంకు మధ్యాహ్నం 2-51కి రావాలి. కానీ గురువారం మూడు గంటల ఆలస్యంతో సాయంత్రం 5-50కి, శుక్రవారం గంటన్నర ఆలస్యంతో గంటలకు 4-20కి, శనివారం 3-10 గంటల ఆలస్యంతో సాయంత్రం 6గంటలకు వచ్చింది. అలాగే, ఆదివారం 2-50గంటల ఆలస్యంతో సాయంత్రం 5-40కు, సోమవారం కూడా 2-50గంటల ఆలస్యంగా సాయంత్రం 5-40కి చేరింది.
- గుంటూరు – సికింద్రాబాద్ మధ్య ప్రతిరోజు నడిచే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ఖమ్మంలో షెడ్యూల్ ఉదయం 8-34గంటలు కాగా శుక్రవారం 40నిమిషాల ఆలస్యంతో 9-15కు వచ్చింది.

పనులతో తగ్గిన రైళ్ల వేగం

మూడో మూడో లైన్ పనుల కారణంగా రైళ్లు నెమ్మదిగా నడుస్తున్నాయి. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్న మాట వాస్తవమే. మూడో లైన్ నిర్మాణం పూర్తయితే అన్ని రైళ్లు కచ్చితమైన సమయానికి నడుస్తాయి.

– ఎం.డీ.జాఫర్, రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్, ఖమ్మం

ఉపాధి పనుల్లో ఆశావర్కర్లు, అంగన్‌వాడీలు!

అక్రమాలు జరిగాయని గుర్తింపు, రికవరీకి ఆదేశం


ఓపెన్ ఫోరమ్‌లో వివరాలు సేకరిస్తున్న అధికారులు

కొణిజర్ల: కొణిజర్ల మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా 2023–24 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన పనులపై సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఓపెన్ ఫోరమ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ పీడీ చుంచు శ్రీనివాసరావు పాల్గొని సామాజిక తనిఖీ బృందాలు గుర్తించిన అంశాలపై ఆరా తీశారు. పలు గ్రామాల్లోని మస్టర్లలో కొట్టివేతలు, మార్పులు కనిపించాయని ఆయన తెలిపారు. అలాగే, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు కూడా ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లినట్లుగా మస్టర్లు వేశారని పేర్కొన్నారు. మొక్కలు నాటినట్లు నమోదు చేసిన ప్రదేశాల్లో మొక్కలు కానరాలేదని తనిఖీ బృందాలు గుర్తించాయని పేర్కొన్నారు. ఈమేరకు బాధ్యులైన సిబ్బంది నుంచి రూ.1.20లక్షల రికవరీకి ఆదేశించగా, ఆయా ప్రాంతాల్లో కొత్త మొక్కలు నాటాలని ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఏపీడీ రామకృష్ణ, ఏడీపీఓ పవన్, అంబుడ్స్‌మెన్ రమేష్, క్వాలిటీ కంట్రోల్ అధికారి వీరయ్య, ఎంపీడీఓ రోజారాణి, ఎస్‌ఆర్‌పీ సాంబశివాచారి, పంచాయతీరాజ్ ఏఈలు రమేష్, కిషోర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా, మండలంలో కొత్తగా జాబ్‌కార్డులు మంజూరు చేయాలని, ఉపాధి కూలీలకు సకాలంలో నగదు చెల్లించాలని సీపీఎం నాయకులు అధికారులకు వినతిపత్రం అందజేశారు.

పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వారిపై కేసు

పట్టుబడిన బియ్యం విలువ రూ.10.56లక్షలు

కొణిజర్ల: ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా రెండు లారీల్లో రేషన్ బియ్యం తరలిస్తున్న వారిపై కేసు నమోదైంది. ఏపీలోని కృష్ణా జిల్లా జగ్గయ్యపేటకు చెందిన జగదీష్ పీడీఎస్ బియ్యాన్ని జిల్లాలోనివివిధ గ్రామాల్లో కొనుగోలు చేసి లారీల్లో కాకినాడ తరలిస్తుంటాడు. ఈక్రమంలో 13న ఖమ్మం ప్రకాశ్‌నగర్ ప్రాంతం నుంచి ఓ లారీలో 282 క్వింటాళ్లు, ఏన్కూరు సమీపంలోని గ్రామాల నుంచి 204 క్వింటాళ్ల బియ్యంతో మరో లారీ బయలుదేరగా తనికెళ్ల సమీపాన దాబాలో ఆగారు. ఈమేరకు అందిన సమాచారంతో సివిల్ సప్లయీస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకోగా, అందులో ఉన్నది పీడీఎస్ బియ్యమేనని సివిల్ సప్లయీస్ డీటీ వెంకటేశ్వర్లు తేల్చారు. ఈమేరకు బియ్యం విలువ రూ.10.56 లక్షలు ఉండగా, బియ్యం వ్యాపారి జగదీష్, లారీ డ్రైవర్లు గోపీ, రాముపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జి.సూరజ్ తెలిపారు.

ఏడాదిలో 290 సెల్‌ఫోన్ల రికవరీ

అదనపు డీసీపీ నరేష్‌కుమార్


ఫోన్లు అందుకున్న వారితో అదనపు డీసీపీ, అధికారులు

ఖమ్మం క్రైం: సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు సీఈఐఆర్(సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేస్తుండగా, ఐటీ సెల్ బృందం ట్రాక్ చేశాక స్వాధీనం చేసుకుని బాధితులకు అందిస్తున్నామని అదనపు డీసీపీ నరేష్‌కుమార్ తెలిపారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో రూ.7లక్షల విలువైన 48 ఫోన్లను యజమానులకు ఆయన అందజేసి మాట్లాడారు. ఇందులో రూ.10వేలు మొదలు రూ.1.50 లక్షల విలువైన ఫోన్లు ఉన్నాయని తెలిపారు. ఈ ఏడాది ఇప్పటికే 680 ఫోన్లు పోగొట్టుకున్నట్లు పోర్టల్‌లో నమోదు కాగా 582ఫోన్లను గుర్తించి, 290 ఫోన్లు రికవరీ చేశామని చెప్పారు. ఇందులో కీలకంగా వ్యవహరించిన ఐటీ సెల్ నోడల్ ఆఫీసర్, ఏసీపీ వెంకటేష్, ఎస్సై సత్యనారాయణ, హెడ్‌కానిస్టేబుల్ హేమనాథ్, కానిస్టేబుళ్ల నరేష్, శ్రీనును కమిషనర్, అదనపు కమిషనర్ అభినందించారు.

రేషన్‌షాపులో 180 బస్తాల బియ్యం చోరీ

కల్లూరు/కల్లూరు రూరల్: కల్లూరు మండలం చిన్నకోరుకొండిలోని రేషన్ షాపులో 180 బస్తాల బియ్యాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. కల్లూరులోని పౌరసరఫరాల గోదాం నుంచి 117 క్వింటాళ్ల రేషన్ బియ్యం(234 బస్తాలు) ఆదివారం సాయంత్రం చేరుకోగా రేషన్‌షాపులోని రెండు గదుల్లో నిల్వ చేశారు. అయితే, సోమవారం ఉదయం డీలర్ గుడిద భిక్షాలు వచ్చేసరికి రెండు గదుల తాళాలు పగలగొట్టి ఉండడంతో ఓ గదిలోని రూ.2.40లక్షల విలువైన 180 బస్తాల బియ్యం లేకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈమేరకు డీలర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరిత తెలిపారు. అయితే, 180 బస్తాల బియ్యం ఎత్తుకెళ్లడం ఒకరి వల్ల కాదని, వాహనంతో వచ్చి తీసుకెళ్లి ఉంటారని స్థానికంగా చర్చ జరుగుతుండగా, ఏం జరిగిందో విచారణలో తేలనుంది.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


మంటలు అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ఎన్టీఆర్‌నగర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ ఇంట్లో సామగ్రి కాలిపోయాయి. ఎన్టీఆర్ కాలనీకి చెందిన మున్సిపాలిటీ కాంట్రాక్టు కార్మికురాలు తడికమళ్ల జయమ్మ ఇంట్లో సోమవారం షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగాయి. దీంతో ఫ్రిజ్, టీవీ, మంచం, రెండు బీరువాలతో పాటు కూలర్, బంగారు ఆభరణాలు, నగదు కాలిపోగా, అగ్నిమాపక శాఖ సిబ్బంది వై.వెంకటేశ్వరరావు, సతీష్, బాబురావు చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే సామాగ్రి పూర్తిగా కాలిపోగా కట్టుబట్టలే మిగలడంతో బాధిత కుటుంబం రోడ్డున పడినట్లయింది. కాగా, బాధిత కుటుంబానికి మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్, కాంగ్రెస్ నాయకులు ఎం.డీ.కమల్‌పాషా, గాదె చెన్నారావు, సందీప్‌గౌడ్ రూ.4వేల ఆర్థిక సాయం అందజేశారు.

భర్త వేధిస్తున్నాడని మహిళ ఫిర్యాదు

కౌన్సెలింగ్‌కు వచ్చి పీఎస్ సమీపాన పురుగుల మందు తాగిన వ్యక్తి

ఏన్కూరు: భర్త తనను వేధిస్తున్నాడని ఓ మహిళ పోలీసులను ఆశ్రయించగా.. కౌన్సెలింగ్‌కు వచ్చిన ఆ వ్యక్తి పోలీస్‌స్టేషన్ సమీపాన పురుగుల మందు తాగిన ఘటన ఇది. వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా ఏన్కూరుకు చెందిన కల్యాణి, తల్లాడ మండలం కొత్త వెంకటగిరికి చెందిన విజయ్‌కుమార్‌కు కొన్నాళ్ల క్రితం వివాహం జరిగింది. ఇటీవల విజయ్‌కుమార్ తనను వేధిస్తున్నాడని, కొడుతున్నాడని కల్యాణి ఈనెల 6న ఏన్కూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఈనెల 16న(ఆదివారం) కౌన్సెలింగ్ నిమిత్తం భార్యాభర్తలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. కానీ భార్యాభర్తలు సిద్ధంగా లేకపోవడంతో సాయంత్రం రమ్మని ఎస్‌ఐ సూచించారు. సాయంత్రం విజయ్‌కుమార్ వచ్చేసరికి కల్యాణి లేకపోవడం వెళ్లిపోయాడు. ఇక సోమవారం మధ్యాహ్నం విజయ్‌కుమార్ వచ్చి పోలీస్‌స్టేషన్ గేటు వద్ద తనతో తెచ్చుకున్న పురుగుల మందు తాగాడు. ఈవిషయాన్ని గమనించి పోలీస్ వాహన డ్రైవర్ వెంటనే ఆస్పత్రికి తరలించాడు. ఈ విషయం తెలియడంతో సత్తుపల్లి ఏసీపీ ఏ.రఘు చేరుకుని వివరాలు ఆరా తీశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, విషయమంతా సీసీ కెమెరాల్లో రికార్డు అయినందున విజయ్‌కుమార్‌ను ప్రోత్సహించిన వారిపైనా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట సీఐ ముత్తిలింగయ్య, ఎస్‌ఐ రఫీ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సాక్షి ఉద్యోగి మృతి


రాజేష్‌కుమార్(ఫైల్)

కొత్తగూడెంటౌన్: మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ సాక్షి దినపత్రిక ఉద్యోగి సోమవారం మృతి చెందాడు. కొత్తగూడెం న్యూ గొల్లగూడేనికి చెందిన తాటిపల్లి రాజేష్‌కుమార్(38) సాక్షి దినపత్రికలో సీనియర్ యాడ్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 14న మధ్యాహ్నం బైక్‌పై రామవరంలో స్నేహితుడి ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈక్రమంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట కొత్తగూడెం వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో రాజేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అదే కారులో క్షతగాత్రుడిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆతర్వాత వరంగల్ ఎంజీఎంకు, అనంతరం హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య నాగలక్ష్మి, ఏడేళ్లలోపు కూతుళ్లు ఇద్దరు ఉన్నారు. ఈ విషయమై కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ ఎం.కరుణాకర్‌ను వివరణ కోరగా.. బైక్‌ను కారు ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందని తెలిపారు. కారు రుద్రంపూర్ తిలక్ నగర్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

లారీడ్రైవర్ ఆత్మహత్య


ఆనందరావు (ఫైల్)

కొణిజర్ల: ఓ వైపు అప్పుల బాధ, మరోవైపు పెళ్లయిన కొద్దిరోజులకే కూతురి భర్త మృతిని జీర్ణించుకోలేక మద్యానికి బానిసైన వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. తనికెళ్ల గంగెడ్లపాడుకు చెందిన లారీడ్రైవర్ తాళ్ల ఆనందరావు(51)కు భార్య శౌరమ్మతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కూతురు వివాహం చేయగా ఈ ఏడాది జనవరిలో అల్లుడు మృతి చెందాడు. అప్పటి నుంచి మద్యానికి బానిసైన ఆనందరావు సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఉరివేసుకున్నాడు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సూరజ్ తెలిపారు.

పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి


మోటార్ సైకిల్ ర్యాలీలో ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, నాయకులు

విజయోత్సవ సభలో ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

ఖమ్మం సహకారనగర్: దీర్ఘకాలంగా ఉపాధ్యాయులు వేచిచూస్తున్న సీపీఎస్ రద్దు, డీఏలు, సర్వీస్ రూల్స్ తదితర సమస్యల పరిష్కారానికి మండలితో తన గళం వినిపిస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఇటీవల ఎన్నికైన పింగిళి శ్రీపాల్‌రెడ్డి వెల్లడించారు. ఖమ్మం – వరంగల్ – నల్లగొండ టీచర్ ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆయన తొలిసారి సోమవారం ఖమ్మం వచ్చారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ నాయకులు 500ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఖమ్మంలోని యూనియన్ కార్యాలయం వద్ద జరిగిన విజయోత్సవ సభలో శ్రీపాల్‌రెడ్డి మాట్లాడారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 ద్వారా వేతనాలు, కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ మంజూరు తదితర అంశాల పరిష్కారానికి పాటుపడతానని తెలిపారు. ఈకార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దామోదర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యలమద్ది వెంకటేశ్వర్లు, రామిశెట్టి రంగారావుతో పాటు మోత్కూరు మధు, సతీష్‌తో పాటు పలువురు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధ్య గేట్ వద్ద అండర్ పాస్ నిర్మించండి

కేంద్ర రైల్వే మంత్రికి ఎంపీ వినతి


రైల్వే మంత్రికి వినతి ఇస్తున్న ఎంపీ రవిచంద్ర

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంను రెండు చీలుస్తూ వెళ్తున్న రైల్వే లైన్‌లో భాగంగా మధ్య గేట్ వద్ద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌ను రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కోరారు. ఈ సందర్భంగా పార్లమెంట్‌లో సోమవారం ఆయనకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కమాన్‌బజార్, గాంధీచౌక్ ప్రాంతాల మధ్య వ్యాపార, వాణిజ్య సంబంధాలకు ప్రధాన మార్గమైన గేట్‌ను నాలుగు నెలలుగా మూసేయడంతో వ్యాపార లావాదేవీలు స్తంభిస్తున్నాయని తెలిపారు. కాగా, రైల్వే శాఖపై రాజ్యసభలో జరిగిన చర్చలోనూ ఎంపీ రవిచంద్ర ఈ అంశాన్ని ప్రస్తావించారు. మూడో లైన్ నిర్మాణ పనుల్లో వేగం పెంచడమే కాక గేట్ స్థానంలో ఆర్‌ఓబీ లేదా అండర్ పాస్ నిర్మించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.

నేత్రపర్వంగా గిరి ప్రదక్షిణ


ఉత్సవమూర్తులను పల్లకీపై తీసుకొస్తున్న అర్చక, ఉద్యోగులు


నృసింహ స్వామి గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తజనం

వేలాదిగా హాజరైన భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలోని స్వయంభూ దివ్య క్షేత్రమైన శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి(గుట్ట) కొండ చుట్టూ గిరి ప్రదక్షిణ సోమవారం సాయంత్రం భక్తుల కోలాహలం మధ్య అంగరంగ వైభవంగా కొనసాగింది. స్వామి జన్మనక్షత్రం (స్వాతి) నిర్వహించే ఈ గిరి ప్రదక్షిణ గత నెలలో మొదలుకాగా ఈసారి పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అర్చకులు, పండితుల వేదమంత్రోచ్చరణల నడుమ స్వామిని ఆలయం నుంచి పల్లకీపైకి చేర్చి గుట్ట కిందకు తీసుకొచ్చాక భజనలు, భజంత్రీలు, కోలాటాల నడుమ గిరి ప్రదక్షిణ చేశారు. ఈసందర్భంగా భక్తులు నృసింహ నామ స్మరణతో మైమరిచిపోయారు. ప్రదక్షిణ పూర్తయ్యాక గుట్టపై ఆలయం పక్కనే రాతి కొండపై నక్షత్ర జ్యోతి(దివ్యజ్యోతి)ని అర్చకులు వెలిగించారు. ఆలయ ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రూ.102 కోట్లతో కేఎంసీ బడ్జెట్

- గత ఏడాదితో పోలిస్తే రూ.12 కోట్ల పెంపు
- మేయర్, కమిషనర్‌తో చర్చించిన అధికారులు



ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ(కేఎంసీ)కు 2025–26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధవుతున్నాయి. ఈసారి బడ్జెట్ రూ.102 కోట్లకు పైగా ఉంటుందని ఇప్పటికే లెక్కలు గట్టారు. కార్పొరేషన్‌కు వచ్చే ఆదాయానికి తోడు వ్యయాన్ని బేరీజు వేసుకుని బడ్జెట్ సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.90.82కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టగా, ఈసారి రూ.12 కోట్ల మేర పెంచారు. కేఎంసీకి జనరల్ ఫండ్‌తో పాటు ఇతర నిధులు కలిపి వచ్చే ఆదాయాన్ని పొందుపరిచి.. వేతనాలు, పారిశుద్ధ్య నిర్వహణ, విద్యుత్ బిల్లులు, రుణాలు, అడ్వాన్సులు, గ్రీన్ బడ్జెట్, పరిపాలన వ్యయం నమోదు చేశారు. అలాగే, విలీన గ్రామాలకు కొంత, వార్డ్ బడ్జెట్ కింద కొంత ఖర్చు చేయాలని ప్రతిపాదించినట్లు తెలిసింది.

మేయర్‌తో చర్చ

2025–26 ప్రతిపాదిత బడ్జెట్ సిద్ధం చేసిన కేఎంసీ అకౌంట్స్ విభాగ అధికారులు మేయర్ పునుకొల్లు నీరజతో చర్చించినట్లు తెలిసింది. ఆదాయ, వ్యయ ప్రతిపాదనలు, గతంతో పోలిస్తే పెంపు, 2024–25 రివైజ్డ్ బడ్జెట్ అమలును వివరించినట్లు సమాచారం. అలాగే, కమిషనర్ అభిషేక్ అగస్త్యతోనూ ఈ అంశంపై చర్చించగా, ఈనెల 27 లేదా 29వ తేదీన కేఎంసీ బడ్జెట్ సమావేశం నిర్వహించాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది.